క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన వైఎస్సార్ తాడిగడప కమిషనర్



చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టర్ పి.రాజాబాబును వైఎస్సార్ తాడిగడప మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన ఎం.వెంకటేశ్వరరావు మంగళవారం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా పనిచేసిన ఎస్.ప్రకాశరావు మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ అడిషనల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. దీంతో ఈ స్థానంలో ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వరరావును వైఎస్సార్ తాడిగడప కమిషనర్‌గా నియమించారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే వంశీ ఆర్థిక సాయం



పాతపాడు(విజయవాడరూరల్): పాతపాడు గ్రామానికి చెందిన కొమరవల్లి జోజి(52) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు కలపాల అబ్రహాం ద్వారా తెలుసుకున్న గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కొమరవల్లి జోజి కుటుంబానికి పంపారు. గ్రామ మాజీ సర్పంచ్ కొమరవల్లి చిన్ని, వైఎస్సార్ సీపీ కన్వీనర్ మంద శివరాజు, పార్టీ నాయకుడు కలపాల అబ్రహాం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, నగదు అందజేశారు. గ్రామ సచివాలయ కన్వీనర్ కొమరవల్లి అనిల్, పార్టీ సీనియర్ నాయకుడు కొమరవల్లి భాస్కర్, నల్లమోతు చిన్నబాబు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పేకాడుతున్న 13 మంది అరెస్ట్

ఉయ్యూరు: మండలంలోని ముదునూరు గ్రామంలో పేకాట శిబిరంపై ఉయ్యూరు రూరల్ పోలీసులు మంగళవారం దాడి చేశారు. గ్రామంలోని ఓ ప్రాంతంలో పేకాట ఆడుతున్న సమాచారం అందుకొన్న రూరల్ ఎస్ఐ అవినాష్ సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో 13 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.30,050లను స్వాధీనం చేసుకొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. పెనమలూరు గ్రామానికి చెందిన ఎల్.ప్రశాంత్ విజయవాడలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అతను కొంతకాలం క్రితం ప్రైవేటు లోన్‌యాప్‌లో రుణం తీసుకున్నాడు. రుణం చెల్లించాలని లోన్‌యాప్ ప్రతినిధులు ఒత్తిడి తేవటంతో ప్రశాంత్ అతని తల్లి నారాయణమ్మను నగదు కావాలని అడిగాడు. దీంతో తల్లి నారాయణమ్మ మందలించటంతో ప్రశాంత్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కరాటే బ్లాక్ బెల్ట్ పోటీల్లో ట్రోఫీ



పెనమలూరు: జాతీయ స్థాయిలో జరిగిన కరాటే పోటీలో యనమలకుదురుకు చెందిన ఎస్.దుర్గారావు జోసెఫ్‌కు గ్రాండ్ చాంపియన్‌షిప్ ట్రోఫీ దక్కింది. ఈ నెల 28న హైదరాబాద్‌లో జరిగిన కరాటే , కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో జాతీయ స్థాయికి 900పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. యనమలకుదురు గ్రామానికి చెందిన దుర్గారావు వ్యక్తిగత కటా 60 సంవత్సరాల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి గ్రాండ్ చాంపియన్‌షిప్ సాధించాడు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు దాత తుమ్మల రవికాంత్, శశికళ (రేమల్లే) సహకారంతో అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈఓ కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బంగారం దుకాణంలో చోరీ

పెనమలూరు: పోరంకిలో బంగారం దుకాణంలో చోరీ జరిగింది. పోరంకి నిడమానూరు రోడ్డులో ఉన్న వెంకట శివదుర్గ బంగారం దుకాణాన్ని దామెర్ల వీరాంజనేయులు నిర్వహిస్తున్నాడు. అతను సోమవారం రాత్రి షాపులో వ్యాపారం ముగించుకొని తాళాలు వేశాడు. అయితే అతను మంగళవారం వచ్చి చూసుకునే సరికి దుకాణం తాళాలు పగలకొట్టి దొంగలు దుకాణంలోకి ప్రవేశించారు. షాపులోని 30 గ్రాముల బంగారు ఆభరణాలు, ఐదు కేజీల వెండి, రూ.1.50 లక్షల నగదు చోరీ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గాంధీజీ ఆశయ సాధనకు కృషి

- వాడవాడలా మహాత్ముని వర్ధంతి కార్యక్రమాలు
- గాంధీజీ సేవలు స్మరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు



ఉంగుటూరులో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ సరోజిని



ఉయ్యూరులో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఉంగుటూరు: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల వ్యాప్తంగా మంగళవారం మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాలను వాడవాడలా నిర్వహించారు. గాంధీజీ సేవలను ప్రజాప్రతినిధులు, అధికారులు స్మరించుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహాత్మా గాంధీ వర్ధంతిని ఎంపీపీ వడ్లమూడి సరోజిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతి సమగ్రతను, ఐక్యతను నిలబెట్టేందుకు గాంధీ అనుసరించిన అహింసా మార్గం నేటికి ఆదర్శనీయమన్నారు. అనంతరం గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషగిరిరావు, సర్పంచ్ కె.వరప్రసాద్, పీఆర్ ఏఈ బాబురావు, ఎంఈఓ - 2 సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

ఉయ్యూరు: జాతిపిత బాపూజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని లయన్స్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ బంగ్లా సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంబశివరావు మాట్లాడుతూ మహాత్ముని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు హసన్ అహ్మద్, ప్రతినిధులు కిషోర్‌కుమార్, రాంబాబు, దినవహిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు

మున్సిపల్ కార్యాలయంలో..

పెనమలూరు: పోరంకిలో ఉన్న మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీజీ విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ సంఘ ఉపాధ్యక్షుడు ఆకునూరు సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లమోతు జీవన్, తెన్నేటి ప్రకాష్,సిహెచ్ వెంకట సాంబశివరావు, సిద్దిక్ పాల్గొన్నారు. యనమలకుదురులో జరిగిన కార్యక్రమంలో తాడిగడప వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్ మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వేమూరి బాలకృష్ణ, ఫణీంద్ర, అనిల్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి నివాళి

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం గుడ్‌మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్ముని చిత్రపటానికి అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చిప్పాడ చంద్రశేఖర్‌రావు, దేవరపల్లి విక్టర్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. పలువురు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. వాకర్స్ అసోసియేషన్ నేతృత్వంలోనూ మహాత్మాగాంధీ వర్ధంతిని జరిపారు. అధ్యక్ష, కార్యదర్శులు ఎం.బాలకృష్ణమూర్తి, వీసం ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.




గన్నవరంలో నివాళులర్పిస్తున్న వాకర్స్

కానూరులో రూ.10 లక్షలు స్వాధీనం

పెనమలూరు: కానూరు మురళీనగర్‌లో పోలీసులు చేసిన తనిఖీల్లో రూ.10 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నారు. సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి మురళీనగర్ ప్రాంతంలో వాహన తనిఖీలు చేస్తుండగా విజయవాడ మాచవరం ప్రాంతానికి చెందిన నల్లవాగుల దుర్గాప్రసాద్ వద్ద రూ.10 లక్షలు నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అతని వద్ద నగదుకు సంబంధించిన సరైన ధ్రువీకరణ పత్రాలు లేనందున నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామారావు తెలిపారు.

నేటి నుంచి బాల ఏసు మహోత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన చర్చి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక గుడివాడ రోడ్డులోని జ్యోతినగర్ ఆర్సీఎం చర్చిలో బుధవారం నుంచి అద్భుత బాల ఏసు మహోత్సవాలను నిర్వహించనున్నట్లు విచారణకర్త ఫాదర్ చేబ్రోలు జోసఫ్ తంబి మంగళవారం తెలిపారు. మూడు రోజుల పాటు వైభవంగా జరిగే ఈ ఉత్సవాల్లో ప్రతి రోజు బాల ఏసుకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని జ్యోతినగర్ చర్చిని విద్యుత్ దీపాలతో వైభవంగా అలంకరించారు.

గడప గడపతో సమస్యల పరిష్కారం

- సచివాలయానికి రూ.20 లక్షల మంజూరు
- డ్రెయిన్లు, అంతర్గత రహదారుల అభివృద్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



తేలప్రోలు కొత్తూరులో నిర్మించిన సీసీ రోడ్డు



ఉంగుటూరులో పూర్తయిన సీసీ డ్రెయినేజీ

ఉంగుటూరు: సంక్షేమ లబ్ధిని గడప చెంతకే చేరవేస్తున్న ప్రభుత్వం అభివృద్ధి పనుల్లోనూ అదే ఒరవడిని కొనసాగిస్తోంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తోంది.

అందుకోసం ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తోంది. నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం నుంచి వారికి అందిన లబ్ధిని వివరిస్తూనే వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. స్థానికంగా వచ్చిన వినతుల్లో సంక్షేమంతో పాటు తాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్, కల్వర్టులు, కమ్యూనిటీ హాళ్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారు.

వేగవంతంగా అభివృద్ధి పనులు....

మండలంలో ఉంగుటూరు, ఎలుకపాడు, పొణుకుమాడు, తేలప్రోలు, ఇందుపల్లి గ్రామాల్లో తొలి ప్రాధాన్యతగా పనులకు నిధులు రూ.60 లక్షలు మంజూరు చేశారు. ఉంగుటూరు సచివాలయ పరిధిలో 4 సీసీ డ్రెయిన్లు పూర్తి చేశారు. తేలప్రోలులో ఐదు సీసీ రోడ్లు పూర్తి చేశారు. ఇందుపల్లిలో 4 సీసీ డ్రెయిన్లు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

మురుగు కష్టాలు తీర్చారు..



ఉంగుటూరు ఎస్సీ కాలనీలో డ్రెయిన్లు లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ స్పందించారు. జీజీఏపీ నిధులు రూ.13 లక్షలతో డ్రెయిన్ నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించారు.

– గుండే బాలస్వామి, ఉంగుటూరు

సీసీ రోడ్ల నిర్మాణం



తేలప్రోలు శివారు కొత్తూరులో ఎన్నో ఏళ్లుగా అంతర్గత రహదారి బురదమయంగా ఉండేది. గతంలో పలు సార్లు అధికారులకు చెప్పిన ఫలితం లేదు. ఎమ్మెల్యే వంశీమోహన్ దృష్టికి తీసుకువెళ్లగానే స్పందించి నిధులు మంజూరు చేశారు. సీసీ రోడ్డును నిర్మించారు.

– వెంకటమహాలక్ష్మి, తేలప్రోలు

ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సురేష్‌రెడ్డి తదితరులు

రామవరప్పాడు: ట్రాఫిక్ నియమ, నిబంధనలు విధిగా పాటించి, తమ గమ్యస్థానాలకు సురక్షితంగా ప్రయాణించాలని ట్రాఫిక్ ఏసీపీ ఎస్.సురేష్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ట్రాఫిక్ నిబంధనలు పాటించి, సురక్షిత ప్రయాణాలు సాగిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఏసీపీ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ట్రాఫిక్ భద్రతా నియమాలు పాటించకుండా చాలా మంది విద్యార్థులు, యువత ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. ద్విచక్రవాహనం, కారు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్, సీట్ బెల్టు ధరించాలని సూచించారు. జీబ్రా క్రాసింగ్, స్పీడు బ్రేకర్ల వద్ద నెమ్మదిగా వెళ్లాలని, వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. యువత అధిక సీసీ గల ద్విచక్ర వాహనాలపై ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారకులు అవుతున్నారన్నారు. ఇటువంటి వారిపై కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ ఆదినారాయణ, జీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి చిత్రలేఖనంలో సత్తా



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్

గన్నవరం: జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో తమ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని స్థానిక వీఎస్ సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ముంబాయికి చెందిన నేషనల్ ఎడ్యుకేషన్ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఈ పోటీలు జరిగాయన్నారు. చిత్రలేఖనంతో పాటు హ్యాండ్ రైటింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తమ పాఠశాల విద్యార్థులు 28 బంగారు పతకాలు, మరో 14 మంది విద్యార్థులు ట్రోఫీ విన్నర్స్‌గా నిలిచారని తెలిపారు. అనంతరం పతకాలు సాధించిన విద్యార్థులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు డి.శ్రీనివాసరావును ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు. సీనియర్ బ్రదర్ జిమ్మీకురియోకోస్, బ్రదర్ భల్లా జోసఫ్, బ్రదర్ జయబాలన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ శ్రీనివాసరావు

విజయవాడరూరల్: జిల్లాలోని మూడు డివిజన్లలో ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి పి.శ్రీనివాసరావు ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు విజయవాడలోని డివిజనల్ పంచాయతీ అధికారి మంగళవారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 15వ తేదీ నాటికి 80 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 29 కోట్ల 30 లక్షల రూపాయల మేర వసూలు కావాల్సి ఉండగా కేవలం 3 కోట్ల 50 లక్షల రూపాయలు మాత్రమే వసూలు చేశారన్నారు. పాత బకాయిలు 7 కోట్ల 32 లక్షల రూపాయలుందన్నారు. ఈ మొత్తంలో 80 శాతం వసూలు చేయాలన్నారు. ఇంటి పన్ను వసూలు చేయడంలో వెనుకంజలో ఉన్న గ్రామ కార్యదర్శులపై ప్రభుత్వ నిబంధనల మేరకు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ గ్రాంటుల రూపంలో వచ్చిన ఆదాయం, ఖర్చుల వివరాలను రికార్డుల ద్వారా తెలియజేయాలన్నారు. రాబోయే సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. సమావేశంలో ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ, తిరువూరు, విజయవాడ డివిజన్లలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాతో క్రీడాకారులకు గుర్తింపు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్డీఓ రాజు, అధికారులు

పెనమలూరు: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటడానికి చక్కని అవకాశం లభించిందని ఆర్డీఓ డి.రాజు తెలిపారు. ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ముగిసిన సందర్భంగా మంగళవారం కానూరులో జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయిలో ఉన్న క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావటానికి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు నిర్వహించిందన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ఉత్తమ క్రీడా ప్రతిభ చాటారని చెప్పారు. నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన జట్లు జిల్లా స్థాయిలో ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లా స్థాయిలో కూడా క్రీడాకారులు సత్తా చాటాలని కోరారు. ఈ సందర్భంగా గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సత్వరమే వైద్య సేవలు



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న సర్పంచ్ శీలం రంగారావు

రామవరప్పాడు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో అవసరమైన వారికి సత్వరమే అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయని నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరు సచివాలయం - 3 పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తొలుత జాతిపిత మహాత్మా గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని గాంధీ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైద్య శిబిరాన్ని ప్రారంభించి పలు రకాల వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రంగారావు మాట్లాడుతూ.. గ్రామంలో తొలి విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను దిగ్విజయంగా నిర్వహించామన్నారు. రెండో విడత కూడా ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో జాగ్రత్త వహిస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు వైద్య సదుపాయాలు అందాలనే ఉద్దేశంతో ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం కంటి, దంత, చర్మ, దీర్ఘకాలిక వ్యాధులతో పాటు సాధారణ వ్యాధులకు సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్, ఎంపీటీసీ మణికంఠ స్వామి, సచివాలయ కన్వీనర్ పరిమి విష్ణు, ప్రభాకర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో దేవదాయశాఖ కమిషనర్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ మంగళవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన కమిషనర్ సత్యనారాయణను ఆలయ ఈఓ కేఎస్ రామారావు సాదరంగా స్వాగతం పలికారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో రామారావు అమ్మవారి ప్రసాదాలు, పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం మాస్టర్ ప్లాన్ పనులు, మల్లేశ్వర స్వామి వారి ఆలయాభివృద్ధి పనుల గురించి ఈవో, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి వివరించారు.



చెత్తను తరలించండి !

స్థానిక కోనాయి చెరువు వద్ద పేరుకుపోయిన చెత్త నిల్వల తరలింపు పనులు అసంపూర్తిగా మిగిలాయి. చెత్త తరలింపు కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తి చెత్తను తరలించకుండా వదిలివేశారు. దీంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. చెత్తను తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- గన్నవరం

ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి అభివృద్ధికి విరాళం



డాక్టర్ వాహినికి విరాళం అందజేస్తున్న ఎన్ఆర్ఐ రఘు, అతని స్నేహితులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం కానుమోలులోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి అభివృద్ధికి ప్రవాస భారతీయుడు వల్లంకొండ రఘు(ఐర్లాండ్) రూ.20 వేలు విరాళాన్ని అందించారు. ఆ మొత్తాన్ని ఆయన చేతుల మీదుగా ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ కె.వాహినికి మంగళవారం అందజేశారు. ఆయుర్వేద ఆస్పత్రిలో కేరళ పంచకర్మ వైద్యం అందించేందుకు గానూ ఈ మొత్తాన్ని వెచ్చించనున్నట్లు డాక్టర్ వాహిని తెలిపారు. పక్షవాతం రోగులకు పూర్తి ఉచితంగా కేరళ పంచకర్మ వైద్యం అందిస్తామన్నారు. దాత వల్లంకొండ రఘు, స్నేహితులు మత్తి రాంబాబు, ఆలపాటి రమణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కొండపల్లి హరిబాబు, వడ్డి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com